# విపశ్యన మాసపత్రిక

VOLUME:16 NO - 07 1 OCTOBER, 2018

(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగు మాసపత్రిక)

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖెత్త, వనస్థలిపురం, హైదరాబాదు – 70


### "ధర్మవాణి"

అస్సద్ధో అకతఞ్ఞూ చ, సన్ధిచ్ఛేదో చ యో నరో ।
హతావకాసో వన్తాసో, స వే ఉత్తమపోరిసో ॥

*– ధమ్మపదపాళీ – 97 – అరహన్తవగ్గో*

అంధవిశ్వాసం లేనివాడు, నిర్వాణాన్ని అనుభూతితో తెలుసుకున్నవాడు, చిత్తధారలో రాగ-ద్వేష-మోహాల సంధిని తెలుసుకుని, పునర్భవానికి కారణమయ్యే దోషాలను సమూలంగా నష్టపరిచినవాడు, కోరికలను జనింపచేసుకునే స్వభావాన్ని సమూలంగా త్యజించేసినవాడు – అటువంటి వాడు పురుషుల్లోకెల్లా ఉత్తముడు.

## ప్రథమ గృహస్థ విపశ్యనాచార్యులు సయా తైజీ

(.. సయా తైజీ రంగూన్ సమీపంలో గల ఇరావదీ నది ఒడ్డున ఉన్న దల్లా అనే గ్రామంలో విపశ్యనా కేంద్రాన్ని స్థాపించి తన జీవితకాలంలో 1000 మందికి పైగా భిక్షువులకు, గృహస్థులకు విపశ్యన నేర్పించి పూర్వ పారమితలలో సంపన్నుడైన గృహస్థుడు కూడా విపశ్యనాచార్యులుగా సఫలురు కాగలరని నిరూపించారు.

భారతదేశపు ఈ పురాతన విద్య తన జన్మభూమి అయిన భారతదేశంతో పాటు విశ్వమంతటా మరొకసారి నెలకొని జనులందరికీ మేలు చేయాలి. పూజ్య గురుదేవులైన సయా జీ ఊ బా ఖిన్ గారి ధర్మఆకాంక్ష సఫలమవ్వాలి.)

**– కళ్యాణ మిత్రుడు, సత్యనారాయణ గోయంకా.**

(ఈ క్రింది వృత్తాంతం, మయన్మార్ ధర్మాచార్యులైన ఉ టేయ్ హ్లాంగ్ రచించిన "సయా తైజీ" అనే పుస్తకం నుండి గ్రహించబడినది.)

సయా తైజీ జూన్ 27, 1873న రంగూన్‌కు దక్షిణభాగాన ఉన్న ఇరావదీ నది అవతలి ఒడ్డుకు 8 మైళ్ళ దూరంలో వ్యవసాయ ఆధార ప్యాబ్వేజి గ్రామంలో జన్మించాడు. అతని చిన్నప్పటి పేరు మౌ ఫో తై. ఆయనకు ఇద్దరు తమ్ముళ్ళు, ఒక చెల్లెలు. ఆయనకు పదేళ్ళు వచ్చేటప్పటికి నలుగురు పిల్లల పోషణ భారాన్ని తల్లిపై ఒదిలేసి తండ్రి కాలం చేశారు.

ఆయన తల్లి సొరకాయ పకోడీలు, పే-యాజో అనే ఫలహారాలు తయారుచేసి అమ్మి కుటుంబాన్ని పోషించేది. ఆయన చిన్నతనంలో, మిగిలిపోయిన ఫలహారాలను అమ్మడానికి ఆయన్ను గ్రామంలోకి పంపేవారు. కానీ తన వద్దనున్న ఫలహారాల వైపుకు ప్రజలను ఆకర్షించడానికి ఎలుగెత్తి పిలవటానికి సిగ్గుపడి అమ్మలేకపోయేవాడు. దానితో వాళ్ళ అమ్మ మౌ ఫో, తన తలపై ఫలహారాల బుట్ట పెట్టి, ఎలుగెత్తి పిలవటానికి తన చెల్లిని తోడుగా పంపేది.

కుటుంబ ఆలనాపాలనలో సహాయం చేయవలసి రావడంతో చదువుకునే అదృష్టం లేక ఆరో తరగతి వరకే చదువుకోగలిగాడు. వ్యవసాయం చేయడానికి వారి వద్ద భూమి లేనందువల్ల ఇతరుల పొలాల్లో కోతల తర్వాత మిగిలిన ధాన్యాన్ని, గడ్డినీ పోగు చేసేవారు. ఒకరోజు పొలం నుండి ఇంటికి తిరిగి వెళుతుండగా ఎండిపోతున్న చిన్ని కుంటలో కొట్టుమిట్టాడుతున్న చేపలను చెరువులో వదులుదామనే ఉద్దేశ్యంతో ఇంటికి తీసుకువచ్చాడు. చేపలను పట్టి తప్పుచేసాడనే ఆలోచనతో తనను కొట్టబోయిన తల్లి, అతని ఉద్దేశ్యాన్ని విని "సాధు, సాధు, సాధు" అని అనింది. (అంటే, చాలామంచి పని చేసావు బాబూ! అని). వారి తల్లి ఎంతో దయ, సహృదయం కల స్త్రీ. ఎన్నడూ తిట్టడం-కొట్టడం చేసేది కాదు కానీ ఏ తప్పునూ (అకుశల) సహించేది కాదు.

14 ఏళ్ళ వయస్సులో ఆయన ధాన్యం తీసుకొనివెళ్ళే బండికి చాలకుడయ్యాడు. తన రోజువారీ కూలీని తల్లికి ఇచ్చేవాడు. ఆ సమయంలో ఆయన ఎంత చిన్నవాడంటే బండి ఎక్కడానికి, దిగడానికి ఒక పెట్టెను తనతో తీసుకువెళ్ళేవాడు.

సారవంతమైన సమతల భూమిపై ఉండే ప్యాబ్వేజి గ్రామం, ఇరావది నదిలో కలిసే ఉపనదులతో సాగుబడి అయ్యేది. వరి పొలాలు వరదల్లో మునిగిపోయి రాకపోకల సమస్య ఏర్పడినప్పుడు "సంపన్" అనే సమతలమైన పొడుగాటి నావ ఒక సాధారణ ప్రయాణ సాధనంగా ఉండేది. ఆ నావను నడపడం మౌ ఫో చేసిన రెండవ పని. ఈ చిన్న పిల్లవాడు ధాన్యాన్ని తీసుకొని వెళుతూ ఎంతో ఉత్సాహంతో, దీక్షతో పనిచేయటం చూసిన బియ్యపు మిల్లు యజమాని ఒకతను తన మిల్లులో ప్రతినెలా ఆరు రూపాయల జీతానికి గుమాస్తాగా నియమించాడు. ఆ సమయంలో అతడు మిల్లులో ఒంటరిగా ఉంటూ బఠాణీ పకోడీలు, బియ్యం మొదలైన పొడిబారి, ఎండిన వస్తువులు తిని ఆకలి తీర్చుకునేవాడు.

మొదట్లో అతడు భారతీయ కాపలాదార్ల వద్ద, ఇతర శ్రామికుల వద్ద బియ్యం కొనేవాడు. వారంతా ఆయనను మిల్లు శుభ్రం చేసేటప్పుడు మిగిలిన నూకలను (వడ్లు దంచేటప్పుడు నేలపై పడే బియ్యం గింజలు) పందులకూ, కోళ్ళకు మేతగా వేసే బదులు వాటిని తీసుకోమని చెప్పారు. కానీ యజమాని అనుమతి లేనిదే చిన్న బియ్యపు గింజను కూడా

తీసుకోనని మౌ ఫో నిరాకరించాడు. అది వినిన యజమాని దానికి అనుమతిచ్చాడు. కానీ ఇలాంటి బియ్యం అతడు ఎన్నో రోజులు తినాల్సిన అవసరం రాలేదు. అతనెంతో శ్రమతో, దీక్షతో, నిష్ఠతో పనిచేయటాన్ని గమనించిన “సంపణ్” మరియు ఎడ్లబండ్ల యజమానులు అతనికి మంచి బియ్యం ఇచ్చేవారు. అయినప్పటికీ మౌ ఫో మిగిలి పోయిన నూకల్ని పోగుచేసి బియ్యం కొనలేని నిరుపేద గ్రామప్రజలకు ఇచ్చేవాడు.

అలా మిల్లులో సంవత్సరం పాటు పనిచేశాక అతని జీతం పది రూపాయలకు పెంచబడింది. ఇక రెండో ఏడాదికల్లా రూ.15 అయ్యింది. మిల్లు యజమాని అతనికి మంచి బియ్యం కొనుక్కోవటానికి డబ్బులు ఇచ్చేవాడు, దానితో పాటు తన కుటుంబ సభ్యుల కొరకు 100 వడ్ల బస్తాలు దంచుకోవటానికి అనుమతినిచ్చాడు. అలా ఆయన జీతం అంతకంతకు పెరిగి 25 రూపాయలు కావటంతో తన తల్లికి ఎంతో ఆసరా దొరికింది.

ఆ కాలపు ఆచారం ప్రకారం 16 సంవత్సరాలకు పెళ్లి చేసుకుని అమ్మాయికి బదులుగా అబ్బాయి అత్తగారింటికి ఇల్లరికం వెళ్ళేవారు. ఆ ఆచారం ప్రకారం అతనికి మా మ్విన్ తో వివాహం జరిగింది. అతని భార్య సంపన్న భూస్వామి, వ్యాపారస్థుడైన రైతు యొక్క ముగ్గురు కూతుళ్ళలో రెండవ కూతురు. అలా అతడు తన భార్య యొక్క తల్లిదండ్రులు, అక్కచెల్లెళ్ళతో కలిసి ఉమ్మడి కుటుంబంలో ఉండసాగాడు. వారికి ఇద్దరు పిల్లలు కలిగారు. ఒక అమ్మాయి, ఒక అబ్బాయి, అతని భార్య యొక్క చెల్లెలు మా యిన్ పెళ్లి చేసుకోకుండా స్వంతంగా ఒక చిన్న వ్యాపారాన్ని విజయవంతంగా నడిపేది. తరువాతి కాలంలో ఉ ఫో తై కి ధ్యాన సాధన చేయడంలోనూ, నేర్పించడంలోనూ ఈమె ఎంతో సహాయం చేసింది.

మా మ్విన్ యొక్క అక్క కోకాయే ని వివాహమాడి మౌ న్యుమ్ అనే కుమారునికి జన్మనిచ్చింది. కోకాయే కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయాన్ని, వ్యాపారాన్ని చూసుకుంటే, ఉ ఫో (బర్మాలో చిన్నప్పటి నుండి యుక్తవయసు వరకు ‘మౌ’ అనీ, తరువాత ‘ఊ’ అంటే శ్రీ లేదా శ్రీమాన్ అని పిలువబడతారు) ధాన్యాల వ్యాపారాన్ని ఎంతో అభివృద్ధి చేశాడు.

మౌ ఫో కి ‘సామణేరు’డు అయ్యే అవకాశం రాలేదు. (కొద్ది రోజులకు సామణేరునిగా దీక్ష తీసుకోవటమన్నది బర్మాలో ఒక సాధారణమైన, మహాత్వపూర్ణమైన ఆచారంగా ఉండేది) తన తోడల్లుడి కొడుకైన మౌ న్యుమ్ 12 ఏళ్ళ వయసులో సామణేర దీక్ష తీసుకునే సమయంలో అతను కూడా సామణేరుడయ్యాడు. ఆ తర్వాత కొంత కాలంపాటు భిక్షువుగా కూడా ఉన్నాడు.

ఊ ఫో తై తన 23 ఏళ్ళ వయసులో గృహస్థ ఆచార్యుడైన సయా న్యుమ్ దగ్గర ధ్యానం నేర్చుకోవడానికి వెళ్లాడు. అక్కడ ‘ఆనాపాన’ నేర్చుకుని ఏడేళ్ళ వరకూ దాన్నే సాధన చేయసాగాడు.

ఊ ఫో, తన భార్య తరపు బంధువులు – మిత్రులు ఎంతోమంది అదే గ్రామంలో ఉండేవారు. అలా ఇరువైపు బంధువులు అంటే పిన్ని, బాబాయి, మరది – మరదలు, అల్లుళ్ళు, పిన్నాన్న–పెదనాన్న పిల్లలు అందరూ ఎంతో స్నేహంతో కలిసిమెలిసి సుఖ సంతోషాలతో ఉండేవారు.

1903లో ప్రబలిన కలరా వ్యాధి కారణంగా ఆ గ్రామపు సుఖశాంతులు చిన్నాభిన్నమయ్యాయి. గ్రామ ప్రజల్లో కొందరు వ్యాధి ప్రబలిన కొద్దిరోజులకే మరణిస్తే మరికొందరు మరికొన్ని రోజుల తరువాత మరణించారు. వారిలో ఊ ఫో కొడుకు, అప్పుడే యుక్తవయసుకొస్తున్న కూతురు (ఈమె ఆయన ఒడిలోనే ప్రాణాలు వదిలిందని చెబుతారు) కూడా ఉన్నారు. తన తోడల్లుడైన కోకాయే, ఆయన భార్య, వారి కూతురు (ఊ ఫో కూతురితో ఆడుకునే పాప) అందరూ ఆ వ్యాధి బారిన పడ్డారు.

ఈ కష్టం ఊ తై ను మానసికంగా ఎంతగానో కుంగదీసింది, ఆయన మనసు ఎంతో అశాంతికి గురైంది. తాను ఈ దుఃఖం నుండి బయటపడి శాంతిని అన్వేషించడానికి వెళ్ళేందుకు తనకు అనుమతినిమ్మని తన భార్యను, మరదలు మా యిన్ ను, ఇతర బంధువులను అనుమతి కోరాడు.

ఆ అన్వేషణలో అతడు బర్మా అంతటా తిరిగాడు. ఏకాంత సాధన కోసం కొండల్లోకి, అడవుల్లోని విహారాలకు వెళ్లాడు. గృహస్థ ఆచార్యుల నుండి, భిక్షు ఆచార్యుల నుండి కూడా శిక్షణ పొందాడు. చివరకు తన మొట్టమొదటి ఆచార్యులైన సయా న్యుమ్ సూచన మేరకు భదంత లైడి సయదా వద్ద మార్గదర్శకత్వం తీసుకోవటానికి ఉత్తర దిశలో ఉన్న మోన్యేవకు వెళ్లాడు. ఈ యాత్రలో శ్రద్ధావంతుడైన సహచరుడు, అనుయాయుడైన ఊ న్యో ఆయనకు తోడుగా నిలిచాడు.

ఇన్ని సంవత్సరాల ఈ ఆధ్యాత్మిక అన్వేషణా సమయంలో ఆయన భార్య, మా ఇన్ ఇద్దరూ ప్యాబ్వేజిలోనే ఉంటూ ఎంతో నేర్పుతో పొలం పనులు చూసుకుంటూ ఉండేవారు. మొదట్లో ఆయన అప్పుడప్పుడూ ఇంటికి వెళ్లి క్షేమ సమాచారాలు తెలుసుకునేవాడు. కానీ కుటుంబం కోలుకుంటోందని తెలుసుకుని ఇక నిరంతర ధ్యానమగ్నుడయ్యాడు. అలా అతడు ఏడుసంవత్సరాల పాటు లైడి సయదాతో ఉంటూ సాధన అభ్యసించాడు. వ్యవసాయం ద్వారా వచ్చే రాబడితో ఆయన భార్య, మరదలు ఆయనకు సాయం చేసేవారు.

ఏడు సంవత్సరాల తర్వాత ఉ న్యో తో పాటు తన గ్రామానికి వెళ్ళిన ఆయన తన పూర్వ గృహస్థ జీవనాన్ని కొనసాగించలేదు. ఎందుకంటే ఆయన తిరిగి వచ్చేటప్పుడు, “భవిష్యత్తులో మెల్ల–మెల్లగా ఇతరులకు నేర్పించడం మొదలుపెట్టడానికి వీలుగా శ్రద్ధగా సాధనచేసి సమాధి (ధ్యానం) మరియ పన్య (ప్రజ్ఞ, అంటే స్వానుభూతితో కలిగిన ప్రత్యక్ష జ్ఞానం) లను పెంచుకోమని” లైడి సయదా వారితో చెప్పారు.

వారు చెప్పిన విధంగానే ప్యాబ్వేజి తిరిగి వెళ్ళగానే డల్లా గ్రామంలో తన కుటుంబ విడిది గృహం (ఫార్మ్‌హౌస్) “శాల“ కు వెళ్ళిపోయాడు. అతడు ఈ శాలను ధర్మ–కక్ష్యగా ఉపయోగించుకోసాగాడు. అక్కడ నిరంతర ధ్యానంలో మునిగిపోయాడు. ఈ ఏకాంత సాధన చేస్తున్నన్ని రోజులూ ప్రతిరోజూ రెండు పూటలా భోజనం వండటానికి ఆ శాలకు దగ్గరలోనున్న ఒక మహిళ నియమించబడింది.

ఊ తైజీ ఇలా ఒక సంవత్సరం పాటు గడిపాడు. కొద్దిరోజుల్లోనే అతడు ధ్యానంలో ప్రగతి చెందాడు. చివరికి తన ఆచార్యుల మార్గదర్శకత్వం యొక్క ఆవశ్యకతను అర్థం చేసుకున్నాడు. అతడు లైడి సయదాను

కలుసుకోలేకపోయాడు కానీ, వారు రాసిన కొన్ని పుస్తకాలు తన ఇంటి అలమారాలో ఉన్నాయని తనకి తెలుసు. ఆ పుస్తకాలను తీసుకోవటానికి ఇంటి వైపు బయలుదేరాడు.

ఇన్ని ఏళ్ళు బయట గడిపిన తర్వాత కూడా ఇంటికి తిరిగి రానందుకు ఆయన భార్యా, మరదలు ఆయనపై కోపంతో ఉన్నారు. భార్య ఐతే విడాకులు తీసుకోవాలని అనుకున్నది. ఊ ఫో ఇంటివైపు రావటం చూసి అక్కచెల్లెళ్ళు ఇద్దరూ ఆయనను గౌరవించకూడదనీ, ఆయనకు స్వాగతం పలకవద్దనీ నిశ్చయించుకున్నారు. కానీ తాను గుమ్మం ముందు నిలబడినప్పుడు ఆయనకు స్వాగతం పలకకుండా తమను తాము నియంత్రించుకోలేకపోయారు. కాస్సేపు మాటామంతీ అయిన తర్వాత ఊ ఫో, తనను క్షమించమని అడుగగానే వారిద్దరూ క్షమించేసారు.

ఆ ఇద్దరూ ఆయనను భోజనానికి, తేనీటికి ఆహ్వానించారు. కాని ఆయన ఆ పుస్తకాలు తీసుకుని తాను ఎనిమిది శీలాలు పాటిస్తున్నాననీ, తిరిగి గృహస్థ జీవితంలో అడుగుపెట్టననీ, ఇక వారిద్దరూ అన్నాచెల్లెళ్ళలా ఉండాలని తన భార్యకు నచ్చచెప్పాడు.

భార్య మరియు మరదలు ఆయనను ప్రతిరోజూ ఉదయం భోజనానికి రావలసిందిగా ఆహ్వానించి ఆయనకు సహాయం చేయటానికి కూడా సిద్ధపడ్డారు. ఆయన వారిద్దరి ఔదార్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ వాళ్ళకి ధర్మదానం ఇవ్వటం ద్వారానే వారి ఋణం తీర్చుకుంటానని చెప్పాడు.

ఆయన భార్య పెదనాన్న/ చిన్నాన్న కొడుకు ఊ బా సో తో పాటు మరికొందరు బంధువులు ఆయనను కలిసి మాట్లాడటానికి వచ్చారు. రెండు వారాల తర్వాత ఊ తైజీ తాను భోజనానికి వచ్చిపోవటానికే ఎక్కువ సమయం పడుతోందని చెప్పగా మా ఖ్విన్, మా యిన్ లు మధ్యాహ్న భోజనం “శాల”కే పంపసాగారు.

మొదట్లో గ్రామప్రజలు ఆయన దగ్గర సాధన నేర్చుకోవడానికి తడబడేవారు. ఆయనలోని ఉత్సాహాన్ని చూసి వారు తప్పుగా అర్థం చేసుకునేవాళ్ళు. విపత్తు కారణంగా, గ్రామానికి దూరంగా ఉండటం వల్ల ఆయన తన సమతుల్యాన్ని కోల్పోయారేమో అని అనుకునేవారు. కానీ మెల్లమెల్లగా ఆయన మాటలు, ఆచరణ చూసి నిజంగానే ఊ తై మారిపోయాడని, ఆయన ధర్మబద్ధ జీవితం గడుపుతున్నాడనీ తెలుసుకున్నారు.

ఊ తై యొక్క మిత్రులు, బంధువులలో కొందరు ఆయనకు ధ్యానం నేర్పమని కోరారు. ఊ బా సో పొలంపనులూ, ఇంటి బాధ్యతలూ చేపట్టడానికి ముందుకు వచ్చాడు. ఊ తైజీ చెల్లెలు, అల్లుడు భోజనం వండే బాధ్యత తీసుకున్నారు. అంటే, ఆ శాల ఒక విపశ్యన కేంద్రంగా మారిపోయింది.

1914 వ సంవత్సరంలో, 41 ఏళ్ల వయస్సులో ఊ తైజీ 15 మందికి ఆనాపానా నేర్పించటంతో పని మొదలెట్టాడు. సాధకులందరూ కేంద్రంలోనే ఉండసాగారు. మరి కొంతమంది పాతసాధకులు మధ్యమధ్యలో ఇళ్ళకు వెళ్ళేవారు. ఊ తైజీ తనవద్ద ఉన్న సాధకులకు, ఇంకా ఇతర ఉత్సాహవంతులకు కూడా ధర్మ ప్రవచనాలు ఇచ్చేవాడు. ఆయన ప్రవచనాలు ఎంతో విద్వత్తుతో నిండి ఉన్నట్లు అనిపించేవి. అవి విన్న శ్రోతలకు ఊ తైజీ కి సైద్ధాంతిక విషయాల పట్ల అవగాహన, ఆచారణాత్మక జ్ఞానం మెండుగా ఉన్నాయని అర్థమయ్యేది.

ఊ తైజీ యొక్క భార్య, మరదలి ఉదారమైన ఆర్థిక సాయంతోపాటు ఇతర కుటుంబ సభ్యుల సహకారంతో వారి విపశ్యన – కేంద్రానికి వచ్చిన సాధకులందరికీ భోజనాది సౌకర్యాలకు ఏ లోటూ ఉండేది కాదు. దానితోపాటు సాధన చేసుకోవడానికి వచ్చిన కూలీ పనివాళ్ళకు జీతాలు మొదలైన ఖర్చులు కూడా భరించేటంత సౌకర్యాలు ఏర్పాటు చేయబడ్డాయి.

1915లో ధ్యానం నేర్చుకున్న తరువాత, ఊ తైజీ తన భార్య, మరదలు ఇంకా కుటుంబంలోని ఇతర సభ్యులను తీసికొని లైడి సయదాని దర్శించుకోటానికి మోన్యెవకు వెళ్ళారు. అప్పటికి ఆయన వయసు 70 ఏళ్ళు. ఊ తైజీ, ధ్యాన సాధనలో తన అనుభవాలు, తాను నిర్వహించిన శిబిరాల గురించి చెప్పగా, అది విన్న లైడి సయదా ఎంతో ప్రసన్నత చెందారు.

ఆ కలయికలోనే లైడి సయదా తన చేతికర్రను ఊ తైజీకి ఇస్తూ, “కాబోయే నా శిష్యుడా! నా ఈ చేతికర్ర తీసికొనివెళ్ళు, దీన్ని జాగ్రత్తగా ఉంచు. నీ దీర్ఘాయువు కొరకు దీన్ని ఇవ్వడం లేదు, నీ జీవితంలో యే ఆపదా రాకుండా నువ్వు విజయం సాధించాలని కోరుకుంటూ నీకిది బహుమతిగా ఇస్తున్నాను. ఈ రోజు నుండి నువ్వు 6 వేల మందికి నామ–రూపాల (శరీర–చిత్తాల) ధర్మాన్ని నేర్పించవలసివుంటుంది. నీ దగ్గరనున్న ధర్మం అశేషమైనది. కాబట్టి నువ్వు శాసనం (బుద్ధశాసనం) యొక్క కీర్తిని వ్యాపింపచేయి. నా స్థానంలో “శాసనానికి” సముచిత స్థానమివ్వు అని అన్నారు.

ఆ మరుసటి రోజు లైడి సయదా తన విహారంలోని భిక్షువులందరినీ పిలిచి ఊ తైజీ ని 10–15 రోజులు అక్కడే ఉండి భిక్షువులకు నేర్పమని కోరారు. వారు భిక్షుసంఘంతో, “అందరూ శ్రద్ధగా వినండి, ఈ ఉపాసకుడు నా పరమ శిష్యుడైన ఊ ఫో తై. దక్షిణ బర్మా నుండి వచ్చాడు. యితడు సరిగ్గా నాలాగే ధర్మాన్ని నేర్పించడంలో సమర్థుడు. మీలో ఎవరైనా ధ్యాన సాధన చేయాలనుకుంటే వీరి నుండి నేర్చుకోండి. దాయకుడా! (భిక్షువులకు భోజనము, వస్త్రములు, ఔషధాలు వంటి అవసరాల బాధ్యతను తీసుకున్నవాడు) నువ్వు నా స్థానం నుండే ధర్మ జయకేతువును ఎగరవేయి, ఈ పనిని నా విహారం నుండే ప్రారంభించు“ అని అన్నారు.

అటుపిమ్మట ఊ తైజి శాస్త్రవిదులైన 25 మంది భిక్షువులకు విపశ్యన సాధనను నేర్పించాడు. అప్పటినుండి అతను ‘సయా తైజి’ అనే పేరుతో పిలవడ్డాడు. (సయా అంటే ఆచార్యుడు అని అర్థం)

లైడి సయదా, సయా తైజీని తన స్థానంలో ధర్మం నేర్పడానికి ప్రోత్సహించాడు కానీ, సయా తైజీ సైద్ధాంతిక విషయాల పట్ల తనలో సరైన అవగాహన లేకపోవటం వల్ల ఎంతోనిరుత్సాహపడేవాడు. లైడి సయదా రచించిన రచనల్లో కొన్ని అతనికి కంఠస్థంగా ఉండేవి,

వాటితోపాటు శాస్త్రపరంగా ధర్మాన్ని వివరించటంలో ఎంతగా ఆరితేరారంటే విద్వాంసులైన సయాదోలు (భిక్షు ఆచార్యులు) కూడా అతనిని తప్పు పట్టలేకపోయారు. అంతేకాక లైడి సయదా ఆదేశానుసారం వారి స్థానంలో ఉండి ధర్మాన్ని నేర్పించటం పవిత్రమైన కర్తవ్యం. అయినప్పటికీ సయా థైజి మాత్రం సందేహిస్తూనే ఉండేవాడు. దానితో అతడు ఎంతో శ్రద్ధతో తన గురువుకు నమస్కరిస్తూ, "మీ శిష్యుల్లో నాకు మాత్రమే శాస్త్రాలు పెద్దగా తెలియవు, మీ ఆదేశానుసారం విపశ్యన నేర్పడం ద్వారా 'శాసనాని'కి సేవ చేయడమన్నది ఎంతో సున్నితమైన, కఠినమైన పని. అందుకని భదంతా, నా నివేదన ఏంటంటే నాకు ఎప్పుడు స్పష్టత కావాలన్నా సహాయం చేసి నాకు మార్గదర్శకత్వం చేయండి. దయచేసి నాకు మీ ఆసరా ఇవ్వండి, అవసరమైతే నన్ను తిట్టండి" అని అన్నాడు.

సమాధానంగా, "నా మృత్యు సమయంలో కూడా నిన్ను వదలను" అని లైడి సయదా అభయమిచ్చాడు.
15 నుండి 20 సంవత్సరాలు,

***తరువాయి భాగం వచ్చే సంచికలో...***

(సయాజీ ఊ బా ఖిన్ జర్నల్ నుండి గ్రహించబడింది)

## పాత సాధకుల కోసం గంభీర/ దీర్ఘ శిబిరాలు

**10 రోజుల ప్రత్యేక శిబిరం** – ధమ్మ కొండన్న, కొండాపూర్‌లో అక్టోబర్ 24 నుండి 4 నవంబర్ వరకు

**45 రోజుల శిబిరం** – ధమ్మ నాగాజ్జున, నాగార్జునసాగర్‌లో 19 డిసెంబర్ నుండి 03 ఫిబ్రవరి వరకు

## సతిపట్ఠాన శిబిరం

– 24 అక్టోబర్ నుండి 01 డిసెంబర్ వరకు ధమ్మ ఆరామ, భీమవరంలో

– 07 డిసెంబర్ నుండి 15 డిసెంబర్ వరకు ధమ్మ నాగాజ్జున నాగార్జునసాగర్‌లో

## కిశోర శిబిరాలు

**బాలికలకు** – 20 అక్టోబర్ నుండి 28 అక్టోబర్ వరకు – ధమ్మ నిజ్ఞాన, నిజామాబాదులో

**బాలురకు** – 10 అక్టోబర్ నుండి 18 అక్టోబర్ వరకు – ధమ్మ నాగాజ్జున, నాగార్జునసాగర్‌లో

**బాలురకు** – 27 నవంబర్ నుండి 05 డిసెంబర్ వరకు – ధమ్మ నాగాజ్జున, నాగార్జునసాగర్‌లో

**బాలికలకు** – 08 డిసెంబర్ నుండి 16 డిసెంబర్ వరకు – ధమ్మ నాగాజ్జున, నాగార్జునసాగర్‌లో

## ధమ్మ సేవకుల శిక్షణా శిబిరం

ధర్మసేవ చేయటానికి కావలసిన శిక్షణ కొరకు ఈ శిక్షణా శిబిరాలకు హాజరు కాగలరు. సాధకులు శిబిరం ప్రారంభం రోజు ఉదయం 9గంటలకు కేంద్రంలో హాజరు కావాలి.

01 నవంబర్ నుండి 03 నవంబర్ వరకు –ధమ్మ నిజ్ఞాన, నిజామాబాదులో

09 నవంబర్ నుండి 11 నవంబర్ వరకు – ధమ్మ కొండన్న, కొండాపూర్‌లో

## ధర్మంలో ఎదగండి (కిశోర బాలుర కొరకు శిక్షణా శిబిరం)

కనీసం ఒక్క కిశోర శిబిరం పూర్తి చేసుకుని, 15 నుండి 20 సంవత్సరాల వయసు కలిగిన బాలురు ధర్మాన్ని మరింత లోతుగా అర్థం చేసుకుని, నిజజీవితంలో ఎలా ఆచరించాలో నేర్చుకోటానికి ఉద్దేశించబడిన శిక్షణా శిబిరం. ఈ శిబిరం అక్టోబర్ 14 సాయంత్రం 5 గంటలకు మొదలయి 16వ తేది సాయంత్రం 5 గంటలకు ముగుస్తుంది. శిబిరంలో పాల్గొనదలచిన బాలురు క్రింది నంబర్లలో రిజిస్టర్ చేసుకోవాలి.

Nishant - 8328148928, Balraj - 9705510730
Manikanta - 9550033352


రెండు సంవత్సరాలకు చందా రూ 100/–  **విపశ్యన తెలుగు మాసపత్రిక**  జీవిత చందా రూ. 500/–

ప్రచురణ తేది: ప్రతినెల 30/31  పోస్టింగ్ తేది: ప్రతి నెల 1/2  వెల: రూ 5/–

విపశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు – 500 070. ఫోన్ : 24240290 (ధ్యానకేంద్రం)

ఆఫీసు పని చేయు వేళలు : ఉదయం 9గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు

Postal Reg. HSE 864/2016-2018 RNI Reg. No. APTEL/2006/17745


**PRINTED MATTER**

If Undelivered please return to :


**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org



Published for Vipassana International Meditation Centre, 12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd.(A.P)-70 Ph: 040-24240290, Published by Smt. Sabrina Katakam. Editor : Sri G.V.Subrahmanyam., Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 2332579.